పుష్పగుచ్ఛాలిచ్చి.. శుభాకాంక్షలు తెలిపి..



మాజీ మంత్రి సబితారెడ్డికి..

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని గురువారం వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ అనంత్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

–వికారాబాద్, జనవరి 2

బీఆర్ఎస్ బలోపేతానికి కృషిచేయండి

మాజీ మంత్రి హరీశ్‌రావును గురువారం బీఆర్ఎస్ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పాండు, కృష్ణ తదితరులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించినట్లు పాండు తెలిపారు.

–పెద్దఅంబర్‌పేట, జనవరి 2

వికారాబాద్ కలెక్టర్‌కు..

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌లకు గురువారం జిల్లా పౌర సంబంధాల అధికారిణి చెన్నమ్మ, ఎంపీడీవోలు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా అసిస్టెంట్ పీఆర్‌వో ప్రభాకర్, ఎంపీడీవోలు వినయ్‌కుమార్, విజయలక్ష్మి, కళాశాకారులు ఉన్నారు.

ట్రెసా ఆధ్వర్యంలో..

ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతిలకు కలెక్టర్‌లోని వారి చాంబర్‌లో ట్రెసా సంఘం తరపున నోట్ పుస్తకాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, ట్రెసా వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్, కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్ దీపక్, తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, వెంకటేశ్‌ప్రసాద్, నైమ త్ అలీ, జయరాం, ఆనందరావు, గణేశ్, సాజిదాబేగం, వెంకటేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్లు సురేశ్, అనిత, శ్రీలత, ట్రేసా సంఘం సభ్యులు సురేశ్, నరేశ్, శ్రీకాంత్, రమేశ్, కృష్ణ, అక్బర్ అలీ, పురుషోత్తం, మురళీకృష్ణ, అర్చన ఉన్నారు. –వికారాబాద్, జనవరి 2

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డికి గురువారం బీఆర్ఎస్ పార్టీ శంకర్‌పల్లి మండల నాయకులు మహ్మద్ అజాజ్, అశోక్ గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు నగరంలోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

–చేవెళ్ల రూరల్, జనవరి 2

14 మంది ఎంఎల్‌హెచ్‌పీల నియామకం

జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ 14 మంది ఎంఎల్‌హెచ్‌పీలను నియమించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ ప్రకారం 14 మంది ఎంఎల్‌హెచ్‌పీలకు కౌన్సెలింగ్ నిర్వహించి, నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జీవరాజ్, డాక్టర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. –వికారాబాద్, జనవరి 2

దూడకు తొట్టెల చేసి.. స్థానికులకు విందుభోజనాలు

మూగ జీవాలపై ప్రేమను చాటుకున్న దంపతులు

ఆ దంపతులకు మూగ జీవాలపై ప్రేమ అంతాఇంత కాదు. ఆవుకు దూడ జన్మించడంతో తొట్టెల కట్టి, స్థానికులకు విందు భోజనాలు పెట్టారు. మోమిన్‌పేట మండలంలోని ఎన్కతల గ్రామానికి చెందిన కుమ్మరి అంజయ్య, కమలమ్మ దంపతులకు ఆవు ఉన్నది. ఈ మధ్యనే అది కోడె దూడకు జన్మనిచ్చింది. జనవరి ఒకటో తేదీకి 21 రోజులు కావడంతో తొట్టెల ఏర్పాటు చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పాటలు పాడారు. మూగజీవాలపై ప్రేమను చాటుతున్న ఆ దంపతులను స్థానికులు అభినందిస్తున్నారు. -వికారాబాద్, జనవరి 2

గేటెడ్‌లో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలా..?

- నియంత్రించాల్సింది పోలీసులే..
- గేటెడ్ ప్రశాంతతకు మార్గదర్శకాలు రూపొందించండి

సిటీ పోలీస్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సిటీబ్యూరో: గౌరవప్రదమైన ప్రశాంత జీవనం గడిపేందుకు ఎక్కువ మంది గేటెడ్ కమ్యూనిటీలను ఎంచుకుంటున్నారు. గేటెడ్‌లో నివసించడం ప్రతిష్టాత్మకంగా ఫీలవుతారు. అటువంటి గేటెడ్‌లో అంతర్గతంగా జరిగే అసాంఘిక, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలపై నియంత్రణ లేకుండా పోతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా గేటెడ్‌లో నివసించేవారు దాదాపుగా ధనికవర్గానికి చెందిన వారే కావడంతో వారిపై పోలీసులు, స్థానిక అధికారుల ప్రభావం లేకుండా పోతున్నది. ఈ విషయంలో సిటీ పోలీసులపై హైకోర్ట్ సీరియస్ అయింది. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలోని ఇందూ ఫార్చ్యూస్ ఫీల్డ్స్ విల్లాల కమ్యూనిటీలో అక్రమంగా పేకాట, మద్యపానం, మత్తు పదార్థాల వినియోగం, లైంగిక చర్యలపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ అక్కడ నివాసముంటున్న సీహెచ్ హరిగోవింద ఖొరానారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా పోలీసులు వెళ్లి ఏమీ జరగలేదని తేల్చి చెప్పారు. కమ్యూనిటీలో సెక్యూరిటీ సిబ్బంది పోలీసుల రాకపై ముందస్తు సమాచారం ఇస్తుండడంతో ఆధారాలు మాయం చేస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై విచారించిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఇందూ ఫార్చ్యూస్ ఫీల్డ్ విల్లాలతో పాటు నగరంలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీల పరిస్థితులను తీసుకొని మార్గదర్శకాలు రూపొందించాలంటూ సిటీ పోలీసు కమిషనర్‌కు కీలక ఆదేశాలు జారీ చేశారు. గేటెడ్ కమ్యూనిటీ జీవనశైలి పెరుగుతున్న నేపథ్యంలో అక్కడ జరిగే చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపట్టే అధికారం సిటీ పోలీసు చట్టం కింద పోలీసులకు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. అక్రమ కార్యకలాపాల నిమిత్తం గేటెడ్ కమ్యూనిటీల్లో ఏం చేయాలి.. ఏం చేయకూడదు అన్న అంశాలపై తగిన సలహాలు, మార్గదర్శకాలు రూపొందించి కమ్యూనిటీతో పాటు ప్లాట్ ఓనర్లకు జారీ చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మార్గదర్శకాలతో పాటు అనుసరించాల్సిన చట్ట నిబంధనలు, సర్కారు ఉత్తర్వులను కూడా అందించాలని సూచించింది. కమ్యూనిటీల నుంచి న్యూసెన్స్, నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్, టీజీఎన్‌సీబీలకు కూడా పోలీస్ కమిషనర్ తగిన ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంది.

కమ్యూనిటీల్లో ఫిర్యాదుల స్వీకరణకు ఆయా ఠాణాల పరిధిలో సాధ్యమైతే యాప్ రూపొందించి వాటి ద్వారా ఫిర్యాదు చేసే వారి వివరాలను గోప్యంగా ఉంచే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. సిటీ పోలీస్ చట్టంలోని సెక్షన్ 22, ఇతర నిబంధనల కింద అధికారాలు ఉన్న నేపథ్యంలో మార్గదర్శకాలు రూపొందించి గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్లకు పంపాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

సబ్ కమిటీ ఏర్పాటు చేయాలి..

కమ్యూనిటీ, ఫ్లాట్స్‌లో పబ్లిక్ న్యూసెన్స్, గేమింగ్, అనధికారికంగా మద్యం తాగడం వంటి నేరపూరిత సమస్యలుంటే అవి తెలంగాణ సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం, సహకార సంఘాల చట్టం కింద పరిష్కారం కాలేవని హైకోర్టు పేర్కొంది. పార్కింగ్, పెంపుడు కుక్కలు, మెయింటెనెన్స్ చార్జీలు చెల్లించకపోవడం, పార్టీల నిర్వహణ, డీజేల పెట్టుకోవడం, క్లబ్‌హౌస్ దుర్వినియోగం వంటి అంశాల్లో పొరుగువారిపై చర్యలు తీసుకోవాలంటూ పలు పిటిషన్లు దాఖలు అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు హైకోర్టు పేర్కొంది. ఇందూ ఫార్చ్యూస్ ఫీల్డ్స్ విల్లా కమ్యూనిటీలో ఎగ్జిక్యూటివ్ కమిటీలో లేని వారితో ముగ్గురు సభ్యుల సబ్‌కమిటీని ఏర్పాటు చేయాలని ఓనర్స్ అసోసియేషన్‌ను ఆదేశించింది. ఏవైనా ఫిర్యాదులు అందితే తక్షణం ఎగ్జిక్యూటివ్ కమిటీకి తెలపాలని, ఒకవేళ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిగితే సబ్ కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. క్లబ్ హౌస్ వినియోగంలో చేయాల్సినవి, చేయకూడని వాటిపై సూచనలు రూపొందించి సభ్యులకు, నివాసితులకు అసోసియేషన్ సమాచారం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.

టీజీ సెట్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: తెలంగాణ స్టేట్–స్టేట్‌లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీ సెట్) సర్టిఫికెట్ల జారీని అధికారులు గురువారం ప్రారంభించారు. గతేడాది మేలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 10 నుంచి మూడు రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించారు. ఫలితాలను నవంబర్ 16న విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తైన అనంతరం సర్టిఫికెట్ల జారీని మొదలుపెట్టారు. ఓయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, సెట్ మెంబర్ సెక్రెటరీ, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను జారీ చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సెట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒరిజినల్ అక్‌నాలెడ్జ్‌మెంట్ స్లిప్‌తో వచ్చి తీసుకోవచ్చని పేర్కొన్నారు.

బీఈ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ) కోర్సుల మూడో సెమిస్టర్ మెయిన్ పరీక్ష ఫీజును ఈనెల 6వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

బీఎఫ్ఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్ కోర్సుల మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

బీఈ కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

దేవాదాయ కమిషనర్‌ను కలిసిన టీఎన్జీవో నేతలు

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రధాన దేవాలయాల ఉద్యోగ జేఏసీ నేతలు గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను వినతిపత్రం ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో అనారోగ్య సమస్యలున్న వారిని, భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగం చేస్తున్న వారిని, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ వంటి చిన్న కేడర్‌లలో పని చేస్తూ బదిలీ అయిన వారిని తిరిగి వారి మాతృ సంస్థలకు బదిలీ చేయాలని కోరారు. పేపర్ ప్రమోషన్ పొంది బెనిఫిట్స్ పొందలేకపోతున్న ఉద్యోగులకు వెంటనే సదరు బెనిఫిట్స్ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరగా, ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ముజీబ్, ప్రధాన ఆలయాల జేఏసీ చైర్మన్ రమేశ్ బాబు, కృష్ణ, నవీన్‌కుమార్, నరేశ్ పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి చర్యలేవి?

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): కూల్చివేతలతో పాటు చెరువుల పునరుజ్జీవనంపై హైడ్రా సీరియస్‌గా దృష్టి పెట్టిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల తెలిపారు. ఇందులో భాగంగా మొదట పన్నెండు చెరువులను అభివృద్ధి చేసేందుకు రూపొందించిన డీపీఆర్‌లను ప్రభుత్వానికి అందజేశామని చెప్పారు. అయితే నిధుల పరంగా కోట్ల రూపాయలు అవసమవుతుండటంతో హైడ్రా ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి పెద్దగా స్పందన రాలేదని తెలుస్తోంది. తాము డీపీఆర్‌లు ఇచ్చి నెలరోజులైనా ఇప్పటివరకు చెరువుల పునరుజ్జీవన ప్రతిపాదనలపై రేవంత్ రెడ్డి సర్కార్ స్పందించకపోవడంతో ప్రత్యామ్నాయం వైపు హైడ్రా దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తమకు పై నుంచే ప్రత్యామ్నాయం వెతుక్కోవాలని, బడ్జెట్ అంటే కష్టమని చెప్పినట్లు హైడ్రా అధికారి ఒకరు తెలిపారు. పునరుజ్జీవనానికి ఎంపిక చేసుకున్న పన్నెండు చెరువుల్లో ఒక్కో చెరువు సుందరీకరణకు చెరువు విస్తీర్ణాన్ని బట్టి సుమారుగా ఐదుకోట్ల రూపాయలకు పైగానే బడ్జెట్ అవసరమవుతుందని హైడ్రా అంచనా వేసింది. ఆ దిశగా డీపీఆర్‌లు కూడా తయారుచేసి ప్రభుత్వానికి ఇచ్చింది. కూల్చివేతల తర్వాత హైడ్రా మార్క్ కేవలం కూల్చివేతలే కాదు.. చెరువుల పునరుజ్జీవనం తమ లక్ష్యం అని ప్రజలకు సమాచారమిచ్చేందుకు కమిషనర్ రంగనాథ్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఇప్పటివరకు ప్రతి చోటా కూల్చివేతలే తప్ప ఎక్కడా ఒక్క చెరువు కూడా పునరుజ్జీవనం వైపు అడుగుపడకపోవడంతో హైడ్రా పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదని హైడ్రా బృందం ఇటీవల జరిగిన అంతర్గత సమావేశంలో చర్చించింది. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఏజెన్సీలతో మాట్లాడేందుకు హైడ్రా అధికారులు ప్లాన్ చేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎస్సార్ కింద పలు చెరువులను అభివృద్ధి చేశారు. మళ్లీ అదే తరహాలో చెరువుల అభివృద్ధిలో భాగస్వామ్యం కోరుతూ పలు సంస్థలను హైడ్రా సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ రంగం కాకుండా మిగతా రంగాలకు చెందిన సంస్థలను ఇందులో భాగస్వామ్యం చేయాలంటూ ప్రభుత్వ పెద్దలే కమిషనర్‌కు సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చెరువుల వద్దనున్న కొన్ని ఆక్రమణలు తొలగించి ప్రస్తుతం ఉన్న ఖాళీ స్థలాన్ని తమ స్వాధీనం చేసుకున్న హైడ్రా అక్కడ పనులు మొదలు పెట్టడానికి కావలసిన ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

మొదట నాలుగు చెరువులే..!

హైడ్రా ఏర్పడిన తర్వాత జరిగిన కూల్చివేతల్లో సుమారుగా 210 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఓఆర్ఆర్ లోపల చెరువుల ఆక్రమణలు తొలగించి అక్కడ సుందరీకరణకు చేపట్టవలసిన చర్యలపై కొన్నిరోజుల క్రితం రంగనాథ్ బెంగళూరుకు చెందిన ఆనంద్ మల్లిగవాడ్‌ను హైదరాబాద్ పిలిపించి ఆయనతో చర్చించారు. ఈ మేరకు పునరుజ్జీవనం దిశగా మొత్తం పన్నెండు చెరువులను ఎంపిక చేసుకున్న హైడ్రా ఆయా చెరువుల అభివృద్ధిపై డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసి సర్కార్‌కు ఇచ్చింది. ఈ విషయమై ప్రభుత్వ పెద్దలను సంప్రదించిన కమిషనర్ బృందానికి వారు చేసిన సూచనల మేరకు సీఎస్సార్ కింద నాలుగు చెరువులను తొలి దశలో డెవలప్ చేయబోతున్నారు. అంబర్‌పేట బతుకమ్మకుంట, తార్నాకలోని ఎర్రకుంట, ఖాజాగూడ తౌతోనికుంట, మాదాపూర్‌లోని తమ్మిడి కుంటలను అభివృద్ధి చేయడానికి హైడ్రా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే అంబర్‌పేట బతుకమ్మకుంటలో స్వాధీనం చేసుకున్న స్థలంలో చెత్తనంతా తొలగించి చదును చేశారు. ఆ రకంగా మిగతా చెరువులపై కూడా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

గాడి తప్పుతున్న బల్దియా పాలన

- ఆమడ దూరంలో కౌన్సిల్..
- మూడు నెలలకోసారి జరగాల్సిన సర్వసభ్య సమావేశం ఐదు నెలలు గడిచినా పట్టని యంత్రాంగం

స్టాండింగ్ కమిటీ బాటలోనే పాలక మండలి

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో పాలన గాడి తప్పుతోంది. ఖజానాలో చిల్లిగవ్వ లేక అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. పురోగతిలో ఉన్న పనులు సకాలంలో పూర్తి చేయకుండా నెలల తరబడి కాలయాపన చేస్తున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా ప్రస్తుతం చట్టాల ఉల్లంఘన జరుగుతున్నది. వాస్తవంగా ప్రతి వారానికోకసారి స్టాండింగ్ కమిటీ సమావేశం జరగాలి. మేయర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులు పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలపై చర్చించి రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల మేర విలువైన పనులకు ఆమోదం దక్కుతుంది. గడిచిన కొన్ని నెలలుగా స్టాండింగ్ కమిటీ ముందుకు ఎజెండా అంశాలు రాకుండా సమావేశాలు వాయిదా వేస్తూ వస్తున్నారు. దీంతో ప్రజా సమస్యలు మరింత జఠిలమవుతున్నాయి. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చేయడంపై ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ కోవలోకి ప్రతి మూడు నెలలకోసారి జరగాల్సిన సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) చేరింది. గత జూలై 6న జరిగిన 9వ పాలకమండలి (సర్వసభ్య సమావేశం) అక్టోబర్‌లో జరపాల్సి ఉంది. కానీ ఐదు నెలలు గడిచినా.. నిర్వహించేందుకు కమిషనర్, మేయర్ సిద్ధపడడం లేదు. బల్దియా బడ్జెట్‌తో పాటు స్టాండింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను కౌన్సిల్‌లో సభ్యుల ఆమోదం మేరకు పనులు పట్టాలెక్కాలి. కానీ ఈ అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో నగర పౌరులపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ప్రధానంగా సకాలంలో ప్రభుత్వం దృష్టికి వెళ్లడం అనుమానంగానే ఉంది. కౌన్సిల్ సమావేశం తేదీ ఖరారుపై కమిషనర్ ఇలంబర్తి కనీసం ప్రస్తావనకు తీసుకురాకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం గమనార్హం. మేయర్, కమిషనర్ల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఫిబ్రవరి 20లోపు..

అక్టోబర్ నెలలోనే బడ్జెట్‌కు సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టాల్సి ఉన్నా డిసెంబర్ రెండోవారం వరకు సమయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ చట్టం –1955 ప్రకారం కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలను గత నవంబర్‌లో బడ్జెట్ అంచనాలు, ప్రతిపాదనలపై కమిషనర్ నుంచి వివరణాత్మక సమాచారం స్టాండింగ్ కమిటీ ముందుకు రావాల్సి ఉంది. డిసెంబ ర్ 15వ తేదీలోపు వార్షిక బడ్జెట్ అంచనాలు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని చట్టం పేర్కొంటున్నది. ఈ నెల 10వ తేదీలోపు జనరల్ బాడీ మీటింగ్‌లో సభ్యుల ముందు చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉం టుంది. మార్పులు, చేర్పుల ఆనంతరం ఫిబ్రవరి 20 లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయా ల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా కనబడుతున్నాయి. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన ఆర్థిక సంవత్సరం (2025–26) కు సంబంధించిన రూ. 8440 కోట్ల బడ్జెట్‌ను నిర్ణీత సమయంలో ప్రభుత్వానికి చేర్చుతారా? లేదంటే కాలయాపన చేస్తారా? స్టాండింగ్ కమిటీ సమావేశాల తరహాలోనే, కౌన్సిల్ సమావేశాల లక్ష్యాలను నీరుగారుస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

నేటి నుంచి నుమాయిష్

- మాజీ ప్రధాని సంతాపంలో భాగంగా రెండు రోజులు ఆలస్యం
- 25 లక్షల పైచిలుకు సందర్శించే అవకాశాలు

అబిడ్స్, జనవరి 2: నగర ప్రజలను అలరించేందుకు గాను నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) శుక్రవారం ప్రారంభం కానుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో సంతాప దినాలుగా ప్రభుత్వం ప్రకటించడం, దీంతో జనవరి ఒకటో తేదీన ప్రారంభం కావాల్సిన నుమాయిష్ రెండు రోజులు ఆలస్యంగా ప్రారంభిస్తున్నారు. శుక్రవారం ప్రారంభోత్సవానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రదర్శనను ప్రారంభించనున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.మోహన్, కోశాధికారి డాక్టర్ బి.ప్రభాశంకర్‌లు తెలిపారు. ఎగ్జిబిషన్ మైదానంలో స్టాళ్ల నిర్మాణ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు 46 రోజుల పాటు ఎగ్జిబిషన్ మైదానంలో నుమాయిష్ నిర్వహిస్తారు. ఈ సంవత్సరం 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు గాను స్టాళ్ల కేటాయింపు పూర్తి కాగా, నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. నుమాయిష్‌ను సందర్శించేందుకు గాను నగర నలుమూలల నుంచే కాకుండా పలు జిల్లాల నుంచి లక్షలాది మంది తరలి వస్తారు. గత సంవత్సరం దాదాపు 25 లక్షలకు పై చిలుకు సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించగా, ఈ సంవత్సరం మరింతగా సందర్శకులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చే సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్, కోశాధికారి డాక్టర్ బి.ప్రభాశంకర్‌లు తెలిపారు. ఎగ్జిబిషన్ సందర్భంగా సీసీ కెమెరాలు, వాలంటీర్లు, మెటల్ డిటెక్టర్లు, ప్రత్యేక సెక్యూర్టీ ద్వారా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

84వ వసంతంలోకి ప్రదర్శన..

నుమాయిష్ 84వ వసంతంలోకి అడుగు పెడుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎగ్జిబిషన్‌ను శుక్రవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లతో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు ఈ ప్రారంభోత్సవానికి విచ్చేయనున్నారు.